
సాక్షి సూర్యాపేట

ఆదివారం । 2 । మార్చి । 2025



స్వర్ణ వర్ణ వెలుగుల్లోకి..
యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ దీపాలతో స్వర్ణ వర్ణ శోభితంగా మారింది. - 8లో



ఉత్కంఠగా ఎద్దుల పందేలు
మేళ్లచెరువు మండల కేంద్రంలోని శివాలయం వద్ద నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు ఉత్కంఠగా కొనసాగుతున్నాయి. - 8లో



న్యూస్‌రీల్

నేడు గోదావరి జలాల పునరుద్ధరణ

అర్వపల్లి: ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాకు వారబందీ విధానంలో ఆదివారం గోదావరి జలాలను పునరుద్ధరించనున్నారు. ఈనెల 9వ తేదీ వరకు గోదావరి జలాలు రానున్నాయని నీటి పారుదల శాఖ డీఈఈ ఎం.సత్యనారాయణ తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు.

పోలీస్ స్టేషన్లకు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



సూర్యాపేట పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలతో అధికారులు

సూర్యాపేట టౌన్: ఈనెల 5వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఏ, బీ రెండు సెట్ల ప్రశ్నపత్రాలు శనివారం సూర్యాపేటలోని జిల్లా బల్క్ కేంద్రం నుంచి వివిధ పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రశ్న పత్రాలను కస్టోడియన్లు బాల్తు శ్రీనివాస్, మేడ నిరంజన్‌రెడ్డి, కర్నాటి శ్రీనివాసులు స్వాధీనం చేసుకొని పట్టణంలోని 13 సెంటర్లకు సంబంధించిన సీఎస్, డీఓల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో తేదీల వారీగా భద్రపరిచారు. వీటి పర్యవేక్షణకు వచ్చిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) భానునాయక్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య, డాక్టర్ మద్దిమడుగు సైదులు, కేవీఎల్ నరసింహారావు, కృష్ణ, యాదగిరి, పుల్లయ్య, నరసింహారావు, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు



వేపలసింగారం పీఏసీఎస్ గోదాములో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఏఓ

హుజూర్‌నగర్ రూరల్: జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంతోపాటు మండలంలోని వేపలసింగారం, అమరవరం గ్రామాల్లో పీఏసీఎస్ గోదాం, ప్రైవేట్ ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,682 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ తెప్పించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అందుబాటు ఉంచామన్నారు. అంతేకాకుండా రైతులు చివరగా వేసే యూరియాతో పాటు పొటాష్ కలిపి పిచికారీ చేయడం వల్ల మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఆయన వెంట ఏఓ రావిరాల స్వర్ణ, సిబ్బంది ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి నిత్యారాధనలు కొనసాగాయి. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణ తంతు పూర్తి చేసి ఉత్సవ మూర్తులను ఆలయ తిరుమాడ వీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం.. శాపం

బలహీనంగా జన్మిస్తున్న శిశువులు

- గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోవడమే కారణం
- చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం
- జిల్లా వ్యాప్తంగా పోషణ లోపమున్న పిల్లలు 1,026 మంది



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువు చూస్తున్న టీచర్

హుజూర్‌నగర్: పోషకాహార లోపం చిన్నారుల ఎదుగుదలకు శాపంగా మారుతోంది. ఈ లోపం చిన్నారుల శారీరక, మానసిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గర్భిణిగా ఉన్న సమయంలో తల్లులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల పుట్టే పిల్లలు తక్కువ బరువు, బలహీనంగా ఉంటున్నారు. జిల్లాలో తీవ్ర, అతితీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలు మొత్తం 1,026 మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో పోషణలోపం ఉన్నవారు 900 మంది కాగా అతితీవ్ర పోషణ లోపం ఉన్నవారు 126 మంది ఉన్నారు. గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో ప్రతి 100 మందిలో 20 మంది శిశువులు తక్కువ బరువుతో జన్మిస్తున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు పోషకాహారంపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం



పోషకాహార లోపం కలిగిన పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం స్థానంలో మరిన్ని ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం (బాలామృతం ప్లస్)ను అందిస్తున్నాం. అంతేకాకుండా పోషకాహార లోపం కలిగిన పిల్లల తల్లిదండ్రులకూ అవగాహన కల్పించి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం.
– నర్సింహారావు, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	05
అంగన్‌వాడీ కేంద్రాలు	1,209
మూడేళ్లలోపు చిన్నారులు	25,139
3 నుంచి 6 ఏళ్లలోపు వారు	14,819

ఆకలి పరీక్షతో గుర్తింపు..

ఇంటి వద్ద సరిగ్గా ఆహారం తీసుకోని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకలి పరీక్షలు నిర్వహిస్తారు. కేంద్రానికి వచ్చిన చిన్నారులు 200 గ్రాముల బాలామృతం 45 నిమిషాల్లో తినాలి. తినని వారిని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)కు తీసుకెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అనారోగ్య సమస్యలు ఉన్నాయా, ఆహారం ఎందుకు తీసుకోవడం లేదో వైద్యుల పర్యవేక్షణలో గుర్తిస్తారు. అలాంటి చిన్నారులను 15 రోజుల పాటు వారి పర్యవేక్షణలోనే ఉంచుకుని పౌష్టికాహారం అందిస్తారు. వీరందరికీ ఆటాపాటలతో కూడిన విద్యతోపాటు ఒకపూట సంపూర్ణ భోజనం, ఉడికించిన కోడి గుడ్డు అందజేస్తారు.

తల్లిదండ్రులు ఏం చేయాలంటే..

చిన్నారులు భోజనం సరిగ్గా చేయకున్నా.. పౌష్టికాహారం తీసుకోకున్నా ఇంటి వద్ద వారికి ఇష్టమైన పదార్థాలు వండి తినిపించే ప్రయత్నం తల్లిదండ్రులు చేయాలి. చిరు ధాన్యాలతో వండిన భోజనం, బెల్లం, పల్లీలు, నువ్వుల పట్టీలు తినిపించాలి. పోషకాలు అధికంగా ఉండే ఆకుకూరలు, కాయగూరలతో ఆహారం వండి తినిపించడం ద్వారా పోషకాహార లోపాన్ని అరికట్టవచ్చని ఐసీడీఎస్ అధికారులు అంటున్నారు.

చేతులెత్తి మొక్కుతున్న.. పంటలకు నీరివ్వండి



చినగారకుంట తండాలో ఎండిన వరి పొలాన్ని పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

- రైతుల కష్టాలకు చలించి కంటతడి పెట్టుకున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్: ప్రభుత్వానికి చేతులెత్తి మొక్కుతున్న.. రైతులకు సాగునీరిచ్చి వరి పంటను కాపాడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జదీష్‌రెడ్డి అన్నారు. పెన్‌పహాడ్ మండలం గాజులమల్కాపురం, చినగారకుంట తండాలో ఎండిన పంట పొలాలను శనివారం ఆయన పరిశీలించి ఉద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. కృష్ణా, గోదావరి ఆయకట్టులో పొలాలు ఎండిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పాపమేనని అన్నారు. గోదావరిలో 10వేల క్యూసెక్కుల నీటి లభ్యత ఉన్నా ఇసుక వ్యాపారం కోసం రైతుల పంట పొలాలను ఎండబెడుతున్నారని ఆరోపించారు. ఒక్క కన్నెపల్లి పంప్ హౌస్ బటన్ ఆన్ చేస్తే పంటలన్నీ పండుతాయన్నారు. కాళేశ్వరం మా చేతికి ఇస్తే కేవలం మూడు రోజుల్లో చివరి ఆయకట్టు వరకు నీళ్లు పారిస్తామని సవాల్ విసిరారు. ఎక్కడ కేసీఆర్‌కి పేరొస్తుందోనని రైతుల ఉసురు తీస్తున్నారన్నారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కళ్లు తెరిచి నీటిని అందించి ఉన్న పంటలనైనా కాపాడాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండి గత్యంతరం లేక గొర్ల, పశువులకు మేతకు అమ్ముంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి ఆశగా వరి పంటకు ట్యాంకర్ ద్వారా నీళ్లు అందిస్తున్నామని, మీరే ఏమైనా చేసి తమను గట్టెక్కించాలని పలువురు రైతులు జగదీష్‌రెడ్డిని వేడుకున్నారు. జగదీష్‌రెడ్డి వెంట పెన్‌పహాడ్ మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ నాయకులు దొంగరి యుగేందర్, వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, జూలకంటి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఉద్వేగానికి గురై కంటతడి పెడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

రంజాన్ దీక్షలు ప్రశాంతంగా కొనసాగించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): పవిత్ర రంజాన్ మాస దీక్షలను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో కొనసాగించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై శనివారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అధికారులు, ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల్లో మసీదు, ఈద్గాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, జిల్లా మైనార్టీ అధికారి జగదీశ్వర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, ఆర్డీఓలు వేణుమాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, డీఎస్పీ రవి, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మతపెద్దలు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

కూలీలకు పని కల్పించాలి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో పనికోరిన కూలీలందరికీ పనిదినాలు కల్పించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్ నుంచి ఉపాధిహామీ పథకం, ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీలు, తాగునీరు, శ్రీనిధి, బ్యాంక్ లింకేజీ తదితర అంశాలపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, టీఏలు, ఎఫ్‌ఏలతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు విషయాలపై చర్చించారు. అనంతరం సదరం క్యాంపులు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ, జెడ్పీ సీఈఓ వీవీ.అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీసీహెచ్‌ఓ వెంకటేశ్వర్లుతో కలిసి హాజరయ్యారు.



స్వస్తివాచన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవం

విశ్వక్సేనుడికి తొలిపూజ, స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట : భక్తజనబాంధవుడు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలకు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు శనివారం వైభవంగా శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు ప్రధానాలయంలోని మూలవర్యుల ఆజ్ఞ (అనుమతి)తో పూజలు ప్రారంభించి 10.15కు విశ్వక్సేన ఆరాధన, 10.50గంటలకు స్వస్తివాచన పూజలు చేసి ఉత్సవాలకు తెరలేపారు. విశ్వశాంతి, లోకకల్యాణార్థం నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలను పాంచరాత్రాగమ శాస్త్రానుసారం ప్రధానాలయంలో ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

విశ్వక్సేనుడికి తొలిపూజ

దేవతల సర్వసేనానాయకుడు విశ్వక్సేనుడికి తొలి పూజతో స్వామివారి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో దివ్య మనోహరంగా అలంకరించిన ఉత్సవమూర్తులను గర్భాలయం ఎదుట ప్రత్యేకపీఠంపై అధిష్ఠింపజేశారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా సాగడానికి నిర్దేశించిన మంత్రోచ్ఛరణలతో తొలిపూజా పర్వాలను నిర్వహించారు. ముల్లోకాలకు శుభం కలగాలని వేదమంత్రాలు పఠిస్తూ విశ్వక్సేనుడిని ఆరాధించారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, 11గంటలకు ధ్వజారోహణ వేడుకలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం, హవన పూజలు ఉంటాయి.

స్వస్తిపుణ్యాహవాచనం, రక్షాబంధనం

విశ్వశాంతిని, లోకకల్యాణం కోసం, ప్రాణికోటి, ఇతిబాధలు లేకుండా సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని భగవంతుడిని వేడుకొనుట స్వస్తిపుణ్యాహవాచనం పూజ విశిష్టత. స్వస్తివాచన మంత్ర జలాన్ని గర్భాలయం, ఉప ఆలయాలు, ముఖమండపం, ధ్వజస్తంభానికి, ఆలయ తిరుమాడ వీధులు, ఆలయ పరిసరాల్లో, భక్తులపై సంప్రోక్షణ గావించారు. అనంతరం లోకకల్యాణార్థం సమర్పించబడిన రక్షాబంధనాన్ని స్వీకరించే వేడుక నిర్వహించారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా బంగారు కవచమూర్తులు, ఉప ఆలయాల్లోని ఆండాళ్ అమ్మవారికి, ఆళ్వారులకు, విశ్వక్సేనుడికి, ముఖమండపంలోని ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేశారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు, భక్తులకు రక్షాబంధనం కట్టారు.

శాస్త్రోక్తంగా మృత్సంగ్రహణం

సాయంత్రం నిత్య పూజల అనంతరం 6.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణ వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, ధర్మకర్త నర్సింహమూర్తి, అర్చకులు, యజ్ఞాచార్యులు, పారాయణికులు పాల్గొన్నారు.

రేపే ఎమ్మెల్సీ కౌంటింగ్

25 టేబుళ్లపై ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు

- మధ్యాహ్నం వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం
- గెలుపునకు సరిపడా ఓట్లు రాకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ షురూ
- ఆ తరువాత రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- సోమవారం అర్ధరాత్రి తర్వాత తేలనున్న ఫలితం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ 3వ తేదీన (సోమవారం) జరుగనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు దృష్టిసారించారు. గురువారం పోలింగ్ ముగిసిన తర్వాత 12 జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను నల్లగొండకు తరలించి ఆర్జాలబావిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. 3వ తేదీన ఉదయం వాటికి బయటకు తీసి అక్కడే కౌంటింగ్ నిర్వహిస్తారు. ఈ ఎన్నికల్లో 25,797 ఓట్లకు గాను 24,139 ఓట్లు (93.57శాతం) పోల్ అయ్యాయి.

25 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు

25 టేబుళ్లపై కౌంటింగ్ నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు. ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్‌తో పాటు ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రోఅబ్జర్వర్ ఉంటారు. మొత్తంగా 30 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 60 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 30 మంది మైక్రోఅబ్జర్వర్లను నియమించారు. మరో 250 మంది సిబ్బందిని స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులు తీసుకురావడానికి, కౌంటింగ్‌లో ఇతర పనులకు వినియోగించేందుకు నియమించారు. 250 మంది పోలీసులు అక్కడ భద్రతలో పాలుపంచుకోనున్నారు.

ఉదయం 7 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ల ఓపెన్

లెక్కింపు ప్రక్రియలో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు ఆయా అభ్యర్థులు లేదా వారి తరఫున వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు, అబ్జర్వర్ సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఓపెన్ చేస్తారు. మొదటి రౌండ్‌లో 25 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి బాక్సులు ఓపెన్ చేస్తారు. వాటిలో ప్రతి 25 ఓట్లను బండిల్ కట్టి డ్రమ్ములో వేస్తారు. ఆ తర్వాత మళ్లీ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి మరో 25 పోలింగ్ బూత్‌లకు సంబంధించి బ్యాలెట్ బాక్సులను తీసుకొచ్చి ఇస్తారు. అలా ఎనిమిదిసార్లు 200 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను తెచ్చి బండిల్స్‌గా కడతారు. ఈ ప్రక్రియ అంతా గంటలో పూర్తవుతుంది.

చెల్లిన ఓట్లలో సగానికి పైగా వస్తేనే..

పోలైన ఓట్లలో ఎన్ని ఓట్లు చెల్లుబాటు అవుతాయో, ఆ చెల్లిన ఓట్లలో సగం ఓట్లకు మించి ఒక ఓటును కలిపి గెలుపు కోటాగా నిర్ణయిస్తారు. మొదటి రౌండ్‌లో పోలైన ఓట్లలో ఎవరికైతే సగానికి మించి ఒక ఓటు అధికంగా వస్తుందో వారిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిచినట్లుగా ఎన్నికల అధికారి ప్రకటిస్తారు. ఒక వేళ మొదటి ప్రాధాన్యత ఓటు ద్వారా గెలుపు కోటా రాకపోతే రెండో ప్రాధాన్యత ఓటును లెక్కించాల్సి ఉంటుంది. అంటే ఈ ఎన్నికల్లో మొత్తం ఓట్లు 24,139 పోల్ అయ్యాయి. అందులో సగానికి మించి 12,070 ఓట్లు సాధించిన అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలుస్తారు. ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్న 19 మంది అభ్యర్థుల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లలో గెలుపునకు సరిపడ కోటా ఎవరికి రాకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు.

రెండో ప్రాధాన్యత ఓట్లతో ఎలిమినేషన్ ప్రక్రియ షురూ

మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఏ అభ్యర్థి కూడా గెలువకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ ద్వారా రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. 19 మంది అభ్యర్థుల్లో ఏ అభ్యర్థికి అతి తక్కువ ఓట్లు వస్తాయో, ఆ అభ్యర్థిని ఎలిమినేట్ చేసి, ఆయనకు వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లు ఏయే అభ్యర్థులకు వేశారో, వాటిని ఆయా అభ్యర్థులకు కలుపుతారు. అప్పటికి కూడా గెలుపుకు కోటా రాకపోతే ఆ తర్వాత తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేసి, ఆయనకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరెవరికి వేశారో ఆయా అభ్యర్థులకు ఓ ఓట్లను కలుపుతారు. అప్పుడు మళ్లీ కోటా వచ్చిందా రాలేదా చూస్తారు. ఎవరికైనా గెలుపు కోటా వస్తే దాంతో గెలిచినట్లుగా భావిస్తారు. ఒక వేళ కోటా రాకపోతే అదే తరహాలో చివరి అభ్యర్థి వరకు తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఒక్కొక్కరిగా ఎలిమినేట్ చేస్తూ వస్తారు. అలా గెలుపు కోటా వచ్చేంత వరకు లెక్కిస్తుంటారు. ఒక వేళ చివరికి 19 మందిలో 17 మంది ఎలిమిట్ అయినప్పటికీ గెలుపు కోటా రాకపోతే చివరిలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల్లో ఎవరికి తక్కువ ఓట్లు వస్తాయో ఆ అభ్యర్ ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లలో 19వ అభ్యర్థికి కలుపుతారు. అప్పటికి కోటా వస్తే సరి. కోటా రాకపోయినా ఎవరైతే ఎలిమినేట్ కాకుండా చివరి వరకు ఉంటారో ఆ అభ్యర్థినే విజేతగా ఎన్నికల అధికారి ప్రకటిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఏ అభ్యర్థికీ గెలుపు కోటా రాకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టి రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తే మాత్రం కౌంటింగ్ ప్రక్రియ ఆలస్యం అవుతుంది. అర్ధరాత్రి వరకు సమయం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : వరంగల్– ఖమ్మం –నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సవ్యంగా జరిగేందుకు సహకరించాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏర్పాటు చేయనున్న టేబుళ్లు, చెల్లుబాటు అయ్యే ఓట్లు, కానీ ఓట్ల గుర్తింపు తదితర అంశాలను వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పోటీ చేసే అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం

ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. 25 టేబుళ్లలో ఒక్కో టేబుల్‌పై వెయ్యి ఓట్లను లెక్కిస్తారు. ప్రతి టేబుల్ వద్ద పోటీలో ఉన్న 19 మంది అభ్యర్థులు చూసుకునేలా 19 గడీలు కలిగిన ర్యాక్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడ ఉన్న అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లకు చూపిసూత్ ఆ బ్యాలెట్ పేపర్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు ఎవరికి వేసారో ఆ అభ్యర్థికి సంబంధించిన గడిలో ఆ బ్యాలెట్ పేపర్‌ను వేస్తూ వెయ్యి ఓట్లను ఒక్కో టేబుల్‌పై లెక్కిస్తారు. ఒక వేళ ఓటు చెల్లకపోతే దాన్ని ఏజెంట్లందరికి చూపి పక్కన పెడతారు. అలా మొదటి రౌండ్ కౌంటింగ్ మధ్యాహ్నం 3 గంటల్లోగా పూర్తయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి



మృతిచెందిన గొర్రె పిల్లలు

యాదగిరిగుట్ట రూరల్: కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతిచెందాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. దాతర్‌పల్లి గ్రామానికి చెందిన గుంటి మల్లయ్య తన గొర్రె పిల్లలను పాకలో ఉంచగా.. వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని బాధితుడు కోరుతున్నాడు.

చెట్టు పైనుంచి పడి మృతి

మోత్కూరు: చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో శనివారం జరిగింది. మోటకొండూర్ మండలం వర్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని శాఖంపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల వెంకటేష్(55) మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి మూడ్రోజుల క్రితం వచ్చారు. శనివారం కుమార్తె ఇంటి సమీపంలోని చింత చెట్టు మీదకి ఎక్కిన వెంకటేష్ జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని టోకరా

దేవరకొండ: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి ఇద్దరి నుంచి డబ్బులు వసూలు చేసి పరారయ్యాడు. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో శనివారం వెలుగు చూసింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని బీఎస్‌ఆర్ కాలనీలో గత ఐదేళ్లుగా నివాసముంటున్న మాదన్న కృష్ణ అలియాస్ వేణుగోపాల్‌రెడ్డి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా చలామణి అయ్యాడు. ఈ క్రమంలో దేవరకొండ పట్టణానికి చెందిన స్వాతి, తబ్రీజ్ నుంచి రెండేళ్ల క్రితం సుమారు రూ.26 లక్షలు తీసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. కొన్ని రోజులుగా డబ్బులు తీసుకున్న అతడు మొహం చాటేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు శనివారం దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో యాదగిరి క్షేత్రం

దివిటీల నుంచి స్వర్ణ వర్ణ వెలుగుల్లోకి..

- 1950కి ముందు దివిటీల సహాయంతో యాదగిరిగుట్టపై పూజలు
- నేడు జిగేల్‌మనిపించేలా విద్యుత్ దీపాలంకరణ

యాదగిరిగుట్ట: ఒక వైపు ఆధ్యాత్మిక వైభవం.. మరోవైపు ఆహ్లాదపరిచే పరిసరాలు.. వీటికి తోడు కళ్లు జిగేల్‌మనిపించే విద్యుత్ దీపాలతో యాదగిరీశుడి క్షేత్రం భక్తులకు కనువిందు చేస్తోంది. ఒకప్పుడు చీకట్లో ఉన్న యాదగిరి కొండ.. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా రష్యన్ టెక్నాలజీతో పాటు బెంగళూరుకు చెందిన లైటింగ్ సంస్థ ఏర్పాటు చేసిన అద్భుతమైన విద్యుత్ దీపాలతో స్వర్ణ వర్ణ శోభితంగా మారింది. ప్రతి ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో సైతం హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ విద్యుత్ దీపాలను బిగించి ఉత్సవానికి మరింత శోభను తీసుకొస్తున్నారు.

దశాబ్దాల క్రితం నుంచే..

1950కి పూర్వం విద్యుత్ సదుపాయం లేక దివిటీల సహాయంతో యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు నిర్వహించేవారని, 1952లో అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు యాదగిరి క్షేత్రాన్ని సందర్శించి జనరేటర్ మంజూరు చేశారని పూర్వీకులు చెబుతున్నారు. ఆ తర్వాత అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఈ క్షేత్రాన్ని సందర్శించి విద్యుద్దీకరణకు ఆదేశాలు జారీ చేయడంతో కొండపైనే కాకుండా యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోనూ విద్యుద్దీకరణ పనులు జరిగాయి. అనంతరం ఆలయానికి ప్రత్యేక విద్యుత్ లైన్ వేశారు. విద్యుత్ సదుపాయం సమకూరడంతో నాటి ఈఓ బసవయ్య భాగ్యనగరానికి చెందిన విద్యుత్ దీపాలంకరణ కాంట్రాక్టర్లతో మాట్లాడి కొండపై విద్యుత్ దీపాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని అప్పటి ఆచార్యులు, అధికారులు చెబుతున్నారు. రామ్‌దయాల్ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా విద్యుద్దీకరణను మరింత పెంచారని పేర్కొన్నారు. ఆలయం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత దేవస్థానం అధికారులు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేపట్టారు. 2014 తర్వాత యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ప్రధాన ఆలయ పునర్నిర్మాణ పనులు జరగడంతో మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో కొండ పైన ఆలయంలో అధునాతన విద్యుత్ దీపాలను బిగించి, బంగారు వర్ణంలో కనువిందు చేసేలా తీర్చిదిద్దారు.

ధార్మిక మహాసభలు ప్రారంభం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ఉత్తర మాడ వీధిలోని సాంస్కృతిక వేదికపై శనివారం సాయంత్రం ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ఆధ్వర్యంలో నృసింహ వైభవం గురించి వివరించారు. అదేవిధంగా ఆలయ సన్నిధిలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లోని నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.



ప్రవచనాలు చెబుతున్న గరికపాటి నరసింహారావు

ఆటో బోల్తా.. మహిళా కూలీ మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

త్రిపురారం: అదుపుతప్పి ఆటో బోల్తా పడి మహిళా కూలీ మృతిచెందగా.. మరికొంత మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన నిడమనూరు మండలం వేంపాడు గ్రామ స్టేజీ వద్ద శనివారం జరిగింది. నిడమనూరు ఎస్‌ఐ గోపాల్‌రావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెం గ్రామానికి చెందిన కూలీలు పత్తి, మిరప కాయలు ఏరడానికి ప్రతిరోజు ఆటోలో హాలియా, పెద్దవూర మండలాలకు వెళ్తున్నారు. శనివారం కూడా ఆటోలో 12మంది కూలీలు వెళ్తుండగా.. నిడమనూరు మండలం వేంపాడు గ్రామ స్టేజీ వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్లల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు మేకల రాములమ్మ, అనుముల కృష్ణయ్య, అనుముల సుజాతకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో మిర్యాలగూడలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మేకల రాములమ్మ(55) మృతిచెందింది. మిగతా కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో పరిమితికి మించి కూలీలు ప్రయాణిస్తుండడంతో పాటు అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు. క్షతగాత్రుడు అనుముల కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపారు.



108 వాహనంలో ఆస్పత్రికి వెళ్తున్న గాయపడిన కూలీలు

గుట్టలో 4న టెక్ ఫెస్ట్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 4వ తేదీన ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు టెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యాలను వెలికితీయడానికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రతి సంవత్సరం సృజన టెక్ ఫెస్ట్‌ను నిర్వహిస్తుందన్నారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విభాగానికి చెందిన విద్యార్థులకు నిర్వహించే ఈ ఫెస్ట్‌లో ప్రదర్శించే ప్రాజెక్ట్‌ల నుంచి ఉత్తమ ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి టెక్ ఫెస్ట్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

అనంతగిరి: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన మీసాల గోపయ్య శనివారం అదే గ్రామానికి చెందిన బాలిక ఇంటికి వెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేరని తెలుసుకున్న గోపయ్య ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు గమనించడంతో అక్కడి నుంచి పారిపోయాడు. అదే గ్రామంలో ఉంటున్న బాలిక అక్క రోజుమాదిరిగానే బాలికను తయారుచేసి పాఠశాలకు పంపించేందుకు రాగా.. ఏడుస్తూ జరిగిన విషయాన్ని ఆమెకు వివరించింది. దీంతో బాలిక అక్క గోపయ్యపై అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

భర్త నెట్టివేయడంతో భార్య మృతి

దేవరకొండ: భార్యాభర్తల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో భార్య మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి దేవరకొండ మండలం ముదిగొండ గ్రామంలో జరిగింది. శనివారం సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం ముదిగొండ గ్రామంలో కొత్తెం లక్ష్మయ్య, వెంకటమ్మ(60) దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉండగా.. ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. లక్ష్మయ్య, వెంకటమ్మ శుక్రవారం రాత్రి మద్యం మత్తులో గొడవ పడ్డారు. ఈ క్రమంలో లక్ష్మయ్య ఆగ్రహంతో భార్య వెంకటమ్మను నెట్టివేశాడు. దీంతో కిందపడిన వెంకటమ్మ తలకు తీవ్ర గాయమై మృతిచెందింది. శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి కుమారుడు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

నృసింహుడికి పోచంపల్లి పట్టువస్త్రాలు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి పద్మశాలీ మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు బహూకరిస్తుంటారు. అందులో భాగంగానే శనివారం స్థానిక శ్రీమార్కండేశ్వర స్వామి దేవాలయంలో పట్టువస్త్రాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన, కీర్తనలతో పట్టువస్త్రాలతో ప్రదర్శనగా యాదగిరిగుట్టకు వెళ్లి ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈఓ) భాస్కరశర్మకు రెండు పట్టు చీరలు, పట్టు పంచెలు, రెండు శాలువాలను అందజేశారు. అదే విధంగా మార్కండేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు సీత చంద్రయ్య, మార్కండేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సీత సత్యనారాయణ, అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పద్మశాలీ నాయకులు తడక వెంకటేశం, భారత లవకుమార్, రాపోలు శ్రీను, అంకం మురళి, భోగ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట ఆలయ డీఈఓ భాస్కరశర్మకు పట్టువస్త్రాలు అందజేస్తున్న పోచంపల్లి పద్మశాలీ మహాజన సంఘం సభ్యులు

పట్టువస్త్రాలు అందజేసిన సోలాపూర్ దంపతులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన చాట్ల కేశవ్, ఉమా దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. శనివారం వారు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి 12 పట్టుచీరలు, స్వామివారికి పట్టు పంచెలు, ఇతర వస్త్రాలను ఈఓ భాస్కర్‌రావుకు అప్పగించారు. ప్రతి యేటా బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు ఇస్తామని చాట్లా కేశవ్ తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, టీటీడీ లోకల్ అడ్వైజరీ మాజీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్, చాట్లా కృష్ణకాంత్ తదితరులున్నారు.



ఈఓ భాస్కర్‌రావుకు పట్టువస్త్రాలు అందజేస్తున్న చాట్ల కేశవ్, ఉమా దంపతులు

ఓట్ల లెక్కింపులో పొరపాట్లు చేయొద్దు

- నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వొద్దని రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జాలబావి వేర్‌హౌస్ గోదాముల్లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో అధికారులు, సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సిబ్బంది కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి చివరి వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఫాం–16 సరిపోల్చుకుని బ్యాలెట్ బాక్స్‌లను అభ్యర్థులు వారి ఏజెంట్ల ఎదురుగా సీల్ తీయడం, సంబంధిత ఫారాల్లో సంతకం చేయడం లాంటి పనులు తప్పనిసరిగా చేయాలన్నారు. చెల్లని ఓట్ల విషయంలో సందేహాలు వచ్చినట్లయితే ఏఆర్‌ఓ, రిటర్నింగ్ ఆఫీసర్ టేబుల్ దగ్గర నివృత్తి చేసుకోవాలని సూచించారు. మొదటి ప్రాధాన్యత ఓటు విషయంలో సందేహాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ అశోక్‌రెడ్డి, ఆర్డీఓలు రమణారెడ్డి, శ్రీదేవి, స్ట్రాంగ్‌రూం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండలో సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ జట్టు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఎన్జీ కళాశాల) మైదానంలో శనివారం సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీతూరామ్ తోమర్ ఈ పోటీలను ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న షూటింగ్ బాల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జీతూరామ్

ఉత్కంఠగా కొనసాగుతున్న ఎద్దుల పందేలు

మేళ్లచెరువు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మేళ్లచెరువు మండల కేంద్రంలోని శివాలయం వద్ద నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు ఉత్కంఠగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన సబ్ జూనియర్ విభాగంలో 14 జతల ఎద్దులు పాల్గొనగా ఏపీలోని ప్రకాశం జిల్లా నాగులపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరికి చెందిన ఎద్దుల జత మొదటి బహుమతి సాధించాయి. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన ప్రతీక రామకృష్ణకు చెందిన ఎద్దుల జత రెండో బహుమతి, ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పెదపులిపాక గ్రామానికి గరికపాటి శ్రీధర్‌రావుకు చెందిన జత మూడో బహుమతి సాధించాయి.

జూనియర్ విభాగంలో..

సాయంత్రం నిర్వహించిన జూనియర్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎద్దుల జత మొదటి స్థానం, ఏపీలోని కడప జిల్లా పొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ల శివకృష్ణయాదవ్ జత రెండో బహుమతి సాధించాయి. మొదటి బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, రెండో బహుమతిగా రూ.1,05,000, మూడో బహుమతిగా రూ.95వేలు అందించారు.



బండ లాగుతున్న గిత్తలు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం): ఏపీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను చింతలపాలెం మండలంలో శనివారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా వత్సవాయి మండలం లింగాల వద్ద మున్నేరు వాగు నుంచి చింతలపాలెం మండలం వజినేపల్లికి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా.. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వజినేపల్లి వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎన్టీఆర్ కృష్ణా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు గుంజ రాము, లింగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొంగలు బర్డ్ ఫ్లూతో చనిపోలేదు

- ప్రజలు భయాందోళన చెందవద్దు
- త్రిపురారం మండల పశు వైద్యాధికారి నాగేందర్

త్రిపురారం: త్రిపురారం మండల కేంద్రం నుంచి కుక్కడం వెళ్లే హదారిలో కృషి విజ్ఞాన కేంద్రం వద్ద మృతిచెందిన కొంగలు బర్డ్ ఫ్లూ కారణంగా చనిపోలేదని, అవి సాధారణంగా చనిపోయి రోడ్డుపై పడి ఉన్నాయని త్రిపురారం మండల పశు వైద్యాధికారి నాగేందర్ అన్నారు. శుక్రవారం కొంగలు మృత్యువాత అని సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన ఆయన కొంగలు మృతిచెందిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పెద్ద చెట్లపై కొంగలు ఎక్కువగా ఉండడం వల్ల అవి కొట్లాడుకొని అందులో కొన్ని మాత్రమే చనిపోయాయన్నారు. మిగిలి ఉన్న పక్షులు ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఒకే చోట 50 నుంచి 100 పక్షులు చనిపోతేనే బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉన్నట్లు గుర్తించవచ్చని, ప్రస్తుతం మండలంలో ఎలాంటి బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



కొంగలు మృతిచెందిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

సూర్యాపేటటౌన్: గంజాయి విక్రయించడంతో పాటు సేవిస్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ విలేకరులకు వెల్లడించారు. శుక్రవారం సూర్యాపేట రూరల్ ఎస్‌ఐ ఎన్. బాలునాయక్ తన సిబ్బందితో కలిసి సూర్యాపేట మండలం కేసారం వెళ్తుండగా.. గ్రామ శివారులో నలుగురు యవకులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిలో ముగ్గురిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో కేసారం గ్రామానికి చెందిన మెంతబోయిన గణేష్, గొర్ల శివారెడ్డి, రామారం గ్రామానికి చెందిన పబ్బు వినయ్ ఉన్నారు. వారిని విచారించగా.. ఒడిషా రాష్ట్రంలోని అంపదర్ గ్రామానికి చెందిన ఆనంద్ నుంచి గంజాయి కిలో రూ.2వేలకు కొనుగోలు చేసి బైక్‌పై సూర్యాపేటకు తీసుకొచ్చి విక్రయిస్తామని, అదేవిధంగా నలుగురం కలిసి కేసారం గ్రామ శివారులోని శ్మశాన వాటికలో గంజాయి తాగుతామని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసారం గ్రామానికి చెందిన మామిడి గోపి, ఒడిషా రాష్ట్రంలోని అంపదర్ గ్రామానికి చెందిన ఆనంద్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ ఎస్‌ఐ బాలునాయక్, పెన్‌పహాడ్ ఎస్‌ఐ గోపికృష్ణ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

కారులో తరలిస్తున్న గంజాయి పట్టివేత

- పోలీసుల అదుపులో నిందితుడు
- రూ.10లక్షల విలువైన గంజాయి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం

చౌటుప్పల్ రూరల్: కారులో గంజాయి తరలిస్తుండగా చౌటుప్పల్ మండలం రెడ్డిబాయి గ్రామ స్టేజీ వద్ద శనివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన నిఖిల్ కైలాస్ గైక్వాడ్ కొంతకాలం ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి కొనుగోలు చేసి ముంబైకి తరలించి అక్కడ విక్రయించేవాడు. సొంతంగా గంజాయి తరలిస్తుండడంతో నష్టాలు రావడంతో ముంబైలోని ఓ శావుకారితో గంజాయి తరలించే కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు.

నర్సీపట్నంలో కొనుగోలు చేసి..

నిఖిల్ కైలాస్ గైక్వాడ్ ఏపీలోని నర్సీపట్నంలో వీరబాబు అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి ముంబైలోని శావుకారికి సరఫరా చేసేవాడు. నర్సీపట్నం వెళ్లి తన కారుకు ఏపీ రిజిస్ట్రేషన్ ఉన్న నంబర్ ప్లేట్ వేస్తాడు. కారును వీరబాబు తీసుకుని గంజాయి లోడ్ చేసి నర్సీపట్నం తీసుకొచ్చి నికిల్ కైలాస్ గైక్వాడ్‌కు అప్పగిస్తాడు. అక్కడి నుంచి నిఖిల్ కైలాస్ గైక్వాడ్ విజయవాడ, హైదరాబాద్ మీదుగా కర్ణాటక బార్డర్‌కు చేరుకుని కారుకు కర్ణాటక రాష్ట్ర నంబర్ ప్లేట్‌ను బిగిస్తాడు. మహారాష్ట్ర బార్డర్‌లోకి వెళ్లగానే ఆ రాష్ట్ర నంబర్ ప్లేట్‌ను కారుకు బిగించి ముంబైకి చేరుకుంటాడు. ముంబైలో శావుకారికి గంజాయి అప్పగించి అతడి నుంచి డబ్బులు తీసుకుంటాడు. ఈ క్రమంలోనే శనివారం ఏపీ నుంచి కారులో గంజాయి తీసుకొని వస్తుండగా.. చౌటుప్పల్ మండలం రెడ్డిబాయి గ్రామ స్టేజీ వద్ద శనివారం పోలీస్ సిబ్బందితో కలిసి చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి పట్టుకున్నారు. అతడి నుంచి రూ.10లక్షల విలువైన 51 గంజాయి ప్యాకెట్లు (ఒక్కొటి రెండు కిలోలు), కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ పేర్కొన్నారు. నిఖిల్ కైలాస్ గైక్వాడ్‌పై విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్లు సమాచారం.



పోలీసులు పట్టుకున్న కారు